పట్టణం నుంచి పల్లెలకు గంజాయి

- శివారు ప్రాంతాలే అడ్డా..
- బానిసలవుతున్న యువత
- పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినా.. మారని వైనం



మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై కొట్టె ప్రసాద్ (ఫైల్)

కమాన్‌పూర్: నగరాలు, పట్టణాలే కాకుండా గ్రామాల్లోని యువత సైతం మత్తుకు బానిసవుతోంది. పలువురు యువకులు పట్టణాల నుంచి పల్లెలకు గుట్టుచప్పుడు కాకుండా తీసుకువస్తున్నట్లు స్థానికంగా చర్చ సాగుతోంది. మండలంలోని పలు ప్రాంతాల్లో యువకులు గంజాయి సేవించడానికి అడ్డాలుగా మారుతున్నాయి. రోజురోజుకూ గంజాయికి అలవాటుపడే వారి సంఖ్య పెరుగుతోంది. యువకుల భవిష్యత్ ఏమవుతుందోనని యువకుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మత్తులో బైక్‌పై మితిమీరిన వేగంతో వెళ్తుండడంతో రహదారి వెంట వెళ్లే వారు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల పలువురు యువకులు రోడ్డు ప్రమాదాల బారిన పడ్డ సందర్భాలు సైతం ఉన్నాయి. గతంలో పలువురు యువకులను పోలీసులు పట్టుకొని కౌన్సెలింగ్ ఇచ్చినా.. వారి పద్ధతిలో మార్పు రావడం లేదు.

అడ్డాలుగా ఎంపిక చేసుకొని..

మండల పరిధిలోని గుండారం రిజర్వాయర్ కట్ట, రిజర్వాయర్‌కు సమీపంలోని మామిడి తోట, మండల కేంద్రంలోని ఆదివరాహస్వామి ఆలయం సమీపంలో, సబ్బితం గౌరిగుండం జలపాతం ప్రాంతాలు యువకులు గంజాయి సేవించడానికి అడ్డాలుగా మారుతున్నాయని స్థానికులు మాట్లాడుకుంటున్నారు.

కౌన్సెలింగ్ ఇచ్చినా మారని తీరు..

మండలంలో గంజాయి దందా కొన్నిరోజుల నుంచి జోరుగా సాగుతోంది. మండల కేంద్రంలోని పాఠశాలకు సమీపంలోని ఓ యువకుడితో పాటు గుండారం గ్రామానికి చెందిన పలువురు యువకులు ఈ గంజాయి దందా రహస్యంగా నడుపుతున్నట్లు సమాచారం. సదరు యువకులు ఎవరికీ అనుమానం రాకుండా బైక్‌లపై వెళ్లి పట్టణాల నుంచి తెచ్చిన గంజాయిని ఈ ప్రాంతానికి చెందిన యువకులకు చేరవేస్తున్నట్లు సమాచారం. గతంలో కొంత మంది యువకులను పోలీసులు పట్టుకొని కౌన్సెలింగ్ ఇచ్చినా మళ్లీ కొద్దిరోజుల నుంచే దందా కొనసాగుతోంది.

యువకులే టార్గెట్..

మండలంలోని కమాన్‌పూర్, గుండారం, కమాన్‌పూర్ ఎక్స్ రోడ్, రాంనగర్, జూలపల్లి గ్రామాలకు చెందిన వారితో పాటు రామగిరి మండలం సెంటినరీకాలనీకి చెందిన యువకులను టార్గెట్ చేసుకొని వారికి గంజాయి వాసన చూపిస్తున్నారు. పట్టణ ప్రాంతాల నుంచి తెచ్చిన గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లు, సింగరెట్‌లలో ప్యాక్ చేసి రూ.వందల రూపాయలకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

నిఘా పెంచుతున్నాం



మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో కొన్నిరోజుల నుంచి గంజాయి దందా సాగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఆ ప్రాంతాలల్లో కొన్నిరోజుల నుంచి పోలీసుల నిఘా ఏర్పాటు చేశాం. యువకులు గంజాయికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు. యువకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. గంజాయి తీసుకువచ్చి యువకులకు విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటాం. – కొట్టే ప్రసాద్, ఎస్సై, కమాన్‌పూర్

క్లుప్తంగా

మల్లన్నస్వామి పట్నాలు



కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి గ్రామ శివారులోని శ్రీపర్వతాల మల్లికార్జునస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. ముందుగా స్వామివారికి ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించి మొక్కులు చెల్లించారు. బోనాలు వండి మల్లన్నస్వామికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ ఎలాబోయిన కుమార్, వైస్ చైర్మన్ అమ్మక్క తిరుపతి సౌకర్యాలు కల్పించారు.

వైభవంగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ధర్మారం: మండలంలోని కొత్తూరు గ్రామ శివారులోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం గ్రామం నుంచి పల్లకిలో స్వామివారిని ఊరేగింపుగా గుట్ట వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు హోమం జరపించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించారు.

దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని అల్లీపూర్‌లో యాదవుల ఆరాధ్య దైవం శ్రీమేడలా కేతకీ దేవి సమేత, మల్లికార్జునస్వామి సహిత విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. అలాగే మహాగణపతి, శివలింగ, నందీశ్వర, నాగ ఆంజనేయ, నవగ్రహ, ధ్వజస్తంభం, శ్రీకృష్ణ, శ్రీజమదగ్ని సహిత రేణుకా ఎల్లమ్మతల్లి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర యువనాయకులు సదయ్యగౌడ్ మైక్‌సెట్‌ను అందించారు. బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మనోజ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ అంజయ్య, ఆవుల వెంకటేశ్, లచ్చయ్య తదితరులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. యాదవ సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు మహిళలు ఐక్యంగా ఉండాలి

మంథని: మహిళలు తమ హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలని మంథని విద్యార్థి యువత వ్యవస్థాపకుడు కొండేల మారుతి అన్నారు. సంస్థ కార్యాలయంలో ఆదివారం మహిళా కళాకారులను సన్మానించారు. సమాజంలో మహిళల పాత్ర గొప్పదన్నారు. మంత్రపురి షార్ట్ ఫిల్మ్ సంస్థ నిర్మాణ దర్శకుడు, రచయిత నారమల్ల కృష్ణ, కళాకారులు సిరి, లత, మౌనిక, శ్రీలక్ష్మీ, రవళి, సుమలత ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషిచేయండి



పూలమాల వేస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతీఒక్కరు కృషి చేయాలని రామగిరి మండల విద్యాధికారి ఎనగందుల కొమరయ్య, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం పెద్దపల్లి జిల్లా కోకన్వీనర్ ఆకునూరి బాలంకూస్ అన్నారు. అంబేడ్కర్, పూలేల జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం యైటింక్లయిన్‌కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆలిండియా అంబేడ్కర్ సంఘం జిల్లా నాయకులు బూడిద సమ్మయ్య, మోహన్, రమేశ్, జనార్దన్, కుమార్, విశాల్, శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.

ఎన్టీపీసీ యువకుడికి డాక్టరేట్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండంకు చెందిన సిలివేరి గట్టయ్య(గణేశ్) ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్స్ కాలేజీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగంలో పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ పొందాడు. రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ జంగాలపల్లెకు చెందిన సిలివేరి గట్టయ్య హ్యూమన్ రిసోర్స్ డెవలప్మెంట్ ఇన్ స్పెషల్ లైబ్రరీస్ ఇన్ తెలంగాణ అనే అంశంపై పరిశోధన పూర్తి చేశారు. అనంతరం పరిశోధన గ్రంథాన్ని పరిశీలించిన విశ్వవిద్యాలయం ఎగ్జామినేషన్ బ్రాంచ్ అధికారులు లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగంలో పీహెచ్‌డీకి ఎంపిక చేసి పట్టా ప్రదానం చేశారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



పనులు పరిశీలిస్తున్న డీఆర్‌యూసీసీ సభ్యుడు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనుల్లో వేగం పెంచాలని డీఆర్‌యూసీసీ సభ్యుడు నారాయణదాస్ తివారీ అన్నారు. రైల్వేస్టేషన్‌లో సాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి మాట్లాడారు. అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో జరగకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారన్నారు. ఒకటవ నంబర్ ప్లాట్‌ఫాంలో షెడ్ల నిర్మాణం వెంటనే పూర్తయ్యేలా చూడాలన్నారు. కూనారం రోడ్డులోని ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు వీలైనంత త్వరగా పూర్తి చేసి గేటు కష్టాలను దూరం చేయాలని సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్తానని తివారీ పేర్కొన్నారు. ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు నీటివసతి కల్పించాలన్నారు. పెద్దపల్లి జంక్షన్ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆగేలా చొరవ చూపాలని ఎంపీ వంశీకృష్ణ, రైల్వే ఉన్నతాధికారులకు విన్నవించినట్లు తెలిపారు.

ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు

జూలపల్లి: మండలంలోని కోనరావుపేటలో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. హోమం నిర్వహించి, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, నిర్వహించిన భక్తులు మొక్కులు చెల్లించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. నల్ల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నల్ల మనోహర్‌రెడ్డి, ఆవుల రాజయ్య, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు దారబోయిన నర్సింహయాదవ్, యాదవ సంఘం నాయకులు ఆవుల రామయ్య, కత్తెర్ల రాయమల్లు, డాక్టర్ పోచాలు, మహేశ్ పాల్గొన్నారు.

31 ఏళ్లకు ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, గురువులు

గోదావరిఖనిటౌన్: జనగామ గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి చదివిన 1993–94 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తాము చదివిన పాఠశాలలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 31ఏళ్ల తర్వాత విద్యార్థులంతా ఒకేచోట చేరి తమ చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు భూమయ్య, సలీం, వెంకటయ్య, విశ్వనాథంను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలతో సత్కరించారు. పూర్వ విద్యార్థులు నాగేందర్‌రాజ్, రామకృష్ణ, శ్రీనివాస్, నాగరాజు, మోహన్‌బాబు, తిరుపతి, స్వప్న, ఉమారాణి, ప్రణీత, సంగీత, వసంత, విజయలక్ష్మి, సుభద్ర, నాగరాణి పాల్గొన్నారు.

ఎన్టీపీసీ మహిళలకు జాతీయస్థాయి ఉమెన్ ఐకాన్ అవార్డు





అవార్డు అందుకుంటున్న గోలివాడ చంద్రకళ, కంది సుజాత

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాంతానికి చెందిన ఇద్దరు మహిళలకు జాతీయస్థాయి ఉమెన్ ఐకాన్–2025 అవార్డు అందుకున్నారు. కరీంనగర్ కళాభారతిలో శ్రీలంబోధర కల్చరల్ అకాడమీ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఓ మగువా నీకు వందనం –2025 కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా సామాజిక సేవా విభాగంలో తెలంగాణ మహిళా మిత్ర స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళకు, శ్రీసీతారామ సేవా సమితికి చెందిన కంది సుజాత అవార్డు అందుకున్నారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీకి చెందిన ఇద్దరు మహిళలకు అవార్డులు రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా సాంబశివ కల్యాణోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న పూజారి

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని సాంబశివ ఆలయంలో గంగాభవానీ సమేతశ్రీసాంబశివ కల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పల్ల మురళీధర్, శరత్ ఉన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



వేడుకల్లో పాల్గొన్న దంపతులు

రామగుండం: స్థానిక రైల్వేస్టేషన్ ఎదుట కొండపై నెలకొన్న శ్రీషిర్డీ సాయిబాబా ఆలయ వార్షిక వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీబ్రహ్మర్షి గట్టు నరహరి శర్మావధాని ఆధ్వర్యంలో శ్రీశివ సుబ్రహ్మణ్యస్వామి మహాయాగ మహోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కన్నూరి సతీశ్‌కుమార్ నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేడుకల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కలవేని మల్లేశం, ఆలయ పూజారి శ్రీనివాస్‌శర్మ, సాంబయ్య, లింగమూర్తి, స్వామి, కోటి, తిరుపతి, జనార్దన్, చందు, రాము, విజయ్, పవన్, శ్రీలత, సునీత, స్వరూప, శోభ, భాగ్య, ప్రవళిక ఉన్నారు.

హోరెత్తించిన ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థులు

కోల్‌సిటీ: హోరెత్తించే మ్యూజిక్.. అదిరేటి స్టెప్పులు.. ర్యాంప్‌పై క్యాట్‌వాక్ .. ట్రెడిషనల్ ఫ్యాషన్ షోలతో నర్సింగ్ కాలేజీ స్టూడెంట్స్ వావ్ అనిపించారు. గోదావరిఖని ప్రభుత్వ మహిళా నర్సింగ్ కళాశాలలో ఆదివారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రసూన, వైస్ ప్రిన్సిపాల్ సుశీల, జీజీహెచ్ గైనిక్ హెచ్‌వోడీ శ్రీదేవి మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలన్నారు. నిర్దేశిత లక్ష్యం సాధించాలని సూచించారు. విద్యార్థులకు నర్సింగ్ వృత్తి గురించి అవగాహన కల్పించి, ఫ్లోరెన్స్ నైటింగేల్ అడుగుజాడలను అనుసరించాలని వారు సూచించారు.

సంక్షిప్త వార్తలు

• ఆలయంలో ప్రత్యేక పూజలు

మంథని: మంథని మండలం ఆరెంద గ్రామంలోని శ్రీబాల విశ్వనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి సోదరుడు, శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు స్వామివారిని దర్శించుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్, సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి ఆరెల్లి కిరణ్‌గౌడ్, గ్రామ కాంగ్రెస్ నాయకుడు అనిల్‌రెడ్డి ఉన్నారు.

• మృతుడి కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లించాలి

రామగుండం: అంతర్గాం మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఐకేపీ ఉద్యోగి మేర్గు కుమారస్వామిగౌడ్ మృతిచెందిన విషయం తెలిసిందే. అతడి కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లించాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు బుసిపాక సంతోష్ మహారాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో సమితి ప్రతినిధులు మిట్టపల్లి సతీశ్‌కుమార్, గొర్రె రాజు, జూల రాజేశ్, జూల శ్రీకాంత్, వినయ్ ఉన్నారు.

• సుల్తానాబాద్‌లో ఇఫ్తార్ విందు

సుల్తానాబాద్: పట్టణంలోని ఎస్‌ఆర్ గార్డెన్‌లో ముస్లింలకు విద్యార్థి జేఏసీ జిల్లా కోఆర్డినేటర్ సూర శ్యాం ఆదివారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీపీలు బాలాజీరావు, అయిల రమేశ్, గర్రెపల్లి సింగిల్‌విండో చైర్మన్ జూపల్లి సందీప్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్, తాళ్లపల్లి మనోజ్‌గౌడ్, బోయిని రాజమల్లయ్య, తిప్పారపు దయాకర్, యూత్ నాయకులు సతీశ్, సందీప్, కాశీచరణ్, శ్రీధర్ పాల్గొన్నారు.

• నేడు అంగన్‌వాడీ సమస్యలపై ధర్నా

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే టీచర్, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి తెలిపారు. పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే ధర్నా కార్యక్రమానికి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి హాజరవుతారని పేర్కొన్నారు.

కూనారంలో పోచమ్మ బోనాలు



బోనాలతో గౌడ కులస్తులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని కూనారంలో ఆదివారం గౌడ కులస్తులు పోచమ్మ బోనాలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్లతో శివసత్తుల పూనకాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లారు. పోచమ్మతల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.



సుల్తానాబాద్: పట్టణంలోని రైల్వేస్టేషన్ వెళ్లే రహదారిలో ఎస్సారెస్పీ ఉపకాలువ నీటిని రైల్వే కాంట్రాక్టర్ అక్రమంగా తరలిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వేసవికాలం కావడంతో సరిపడా నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, దీనికితోడు ఉపకాలువ నుంచి నీటిని కాంట్రాక్టర్ అక్రమంగా పనులకు వాడుకుంటున్నారని వాపోయారు. ఇలాంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ రాజుగౌడ్

ముత్తారం: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని మంథని సీఐ రాజుగౌడ్ అన్నారు. ముత్తారం మండలంలోని ఓడేడ్‌లో ఆదివారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై స్థానికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామంలో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అత్యవసర సమయంలో డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. రుణాల పేరుతో సైబర్ నేరగాళ్లు పంపించే మెసేజ్‌లకు స్పందించొద్దని, లింక్‌లు ఓపెన్ చేయడం, ఓటీపీలు చెప్పడం చేయొద్దని వివరించారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. మానేరు తీరంలో యువత గంజాయికి అలవాటు పడినట్లు తెలుస్తోందని, దొరికితే వారిని ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్సై గోపతి నరేశ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఎన్టీపీసీ భూనిర్వాసితులకు న్యాయం చేయాలి



వినతిపత్రం అందిస్తున్న భూనిర్వాసితులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ సంస్థ రామగుండం ప్రాంత భూనిర్వాసితులకు అన్యాయం చేసిందని జాతీయ స్థాయిలో భూనిర్వాసితులకు న్యాయం చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డపల్లి రాంచెందర్‌కు భూనిర్వాసితులు ఆదివారం వినతిపత్రం అందించారు. ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని జ్యోతిభవన్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా భూనిర్వాసితుల సంఘం అధ్యక్షుడు బయ్యపు ప్రభంజన్‌రెడ్డి మాట్లాడారు. 40ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్నప్పటికీ తమకు న్యాయం జరగడం లేదని వాపోయారు. పలు గ్రామాల నుంచి భూములు సేకరించినా నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాల్లో సరైన న్యాయం చేయలేదని ఆరోపించారు. కొత్తగా ఏర్పాటు కానున్న విద్యుత్ ప్రాజెక్టులో గత ఒప్పందం ప్రకారం ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి అజీమ్, రంగారెడ్డి, రాములు, రాజయ్య, శంకరయ్య, సమ్మయ్య ఉన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్లకు సబ్సిడీ రుణాలు అందించాలి

జ్యోతినగర్: జిల్లాలోని ఫొటో, వీడియోగ్రాఫర్లకు సబ్సిడీ రుణాలు అందించాలని ఫొటో, వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పోగుల విజయ్‌కుమార్ కోరారు. ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్ జ్యోతిభవన్‌లో ఆదివారం జాతీయ ఎస్సీ కమీషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచెందర్‌కు జిల్లా ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ కెమెరాల కొనుగోలుకు, స్టూడియోల ఏర్పాటుకు సబ్సిడీ రుణాలు అందించేలా కృషి చేయాలని విన్నవించారు. బ్యాంకర్లు షూరిటీల పేరుతో జాప్యం చేస్తున్నారని ఆయనకు తెలియజేయగా వెంటనే స్పందించి బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేసి రుణాలు సకాలంలో అందించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇర్ఫాన్, అసోసియేషన్ కోశాధికారి అల్లం సతీశ్, నాయకులు బత్తుల రాజు, చంద్రకాంత్, కొత్తూరి సదయ్య, అంగజాల మల్లయ్య, తుమ్మ కళ్యాణ్ పాల్గొన్నారు.

గృహిణి అదృశ్యం

గోదావరిఖని: స్థానిక మార్కండేయకాలనీకి చెందిన శ్రీలక్ష్మి(46) అనే గృహిణి శనివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయిందని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఆమె మానసిక స్థితి సరిగా లేక ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదని పేర్కొన్నారు. ఆమె ఆచూకీ తెలిస్తే వన్‌టౌన్ సీఐ 87126 56516 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఆమె తమ్ముడు శ్రీపతిరావు ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మాజీ మంత్రుల దిష్టిబొమ్మ దహనం



గోదావరిఖనిలో దిష్టిబొమ్మ దహనం

గోదావరిఖని: ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను ఆదివారం స్థానిక ప్రధాన చౌరస్తాలో దహనం చేశారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బొంతల రాజేశ్, నాయకులు పాల్గొన్నారు.

మంథని: అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆదివారం మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. మంథని ప్రధాన చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ తీరును తప్పుపట్టారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద బీఆర్‌ఎస్ మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు.

రామగుండం: కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రామగుండం అంబేడ్కర్ కూడలి, అంతర్గాం అంబేడ్కర్ కూడలిలో జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలు దహనం చేశారు.

ముత్తారం: మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, కేటీఆర్ దిష్టిబొమ్మలను ముత్తారంలో కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు.

రామగిరి: తెలంగాణ చౌరస్తాలో మండల కాంగ్రెస్ శ్రేణులు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. శ్రీపాదభవన్ నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.